www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 17 డిసెంబర్ 2024

5





## నేటి నుంచి అభివృద్ధి లక్ష్యాలపై సిబ్బందికి శిక్షణ

**ప్రజాశక్తి-ముమ్మిడివరం**

మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సుస్థిరతతో కూడిన స్థిరమైన అభివద్ధిని సాధించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ టిఎస్.వెంకటాచార్య పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారుల శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మంగళవారం అయినాపురం, అనాతవరం, అన్నంపల్లి, గేదెల్లంక, లంక ఆఫ్ ఠానేలంక, కమిని, పళ్లవారిపాలెం, క్రాప, చింతలపూడిపాలెం పరిధిలోని కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి, బుధవారం సిహెచ్.గున్నేపల్లి, చినకొత్తలంక, మెర్లపాలెం, గాడిలంక, క్రరివానిరేవు, కొమానపల్లి, కొత్తలంక, ఠానేలంక పరిధిలోని కార్యదర్శులకు శిక్షణ ఉంటుందన్నారు.

# యువత.. ప్రమాదంలో భవిత..!

- ఇంటర్‌నెట్, మత్తు పదార్థాల ప్రభావం
- విచక్షణ కోల్పోయి దాడులు
- అప్పుల ఊబి నుంచి రాలేని పరిస్థితి

**ప్రజాశక్తి-రాజోలు**

ఇటీవల జిల్లాలోని మలికిపురంలో ఒక దారుణ సంఘటన చోటు చేసుకుంది. అమ్మాయికి మెసేజ్ చేశాడని ఒక యువకునిపై ముగ్గురు యువకులు పాశవికంగా దాడి చేశారు. నిర్మానుష్య ప్రదేశంలోకి యువకుని తీసుకెళ్లిన ముగ్గురూ... ఒక్కొక్కరుగా దాడి చేశారు. కొబ్బరిమట్టతో ఒక యువకుడు దాడి చేయగా, మరొకరి గొంతు నులిమి హత్యాయత్నం చేశాడు. బాధిత యువకుడు అమ్మాయి మెసేజ్ చేసినందుకే తాను మెసేజ్ చేసానని చెబుతున్నా వినకుండా విచక్షణారహితంగా యువకుని కొట్టారు. చివరికి యువకుడి బట్టలు చించి, ఆ చొక్కాను యువకుడి మెడకు బిగించి కాళ్లతో తన్నుతూ దాడి చేశారు. మద్యం మత్తులో ఉన్న వారు ఈ దాడికి పాల్పడ్డారు.

జిల్లాలో గడిచిన అయిదేళ్లలో సుమారు 92 గంజాయి కేసులు నమోదవగా 375 మందిని అరెస్టు చేశారు. దాదాపు 4 వేల కిలోల గంజాయి సీజ్ చేశారు. జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే రాజోలు, మలికిపురం ప్రాంతాల్లో గంజాయి వినియోగం, విక్రయ ప్రభావం కాస్త ఎక్కువగా ఉంది. కొందరు ఏజెన్సీ నుంచి తీసుకొచ్చి చిల్లరగా విక్రయిస్తున్నారు. గంజాయికి యువకులే ఎక్కువగా బానిసలుగా మారుతున్నారు. దొరికిన గంజాయి ముఠా సభ్యులపై ఎప్పటికప్పుడు జిల్లా పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు. ఏజెన్సీ నుంచి వచ్చే గంజాయిని తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల మీదుగా రవాణా చేస్తున్నారు. ఇటీవల వాహన తనిఖీల్లో 180 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసు యంత్రాంగం నిత్యం వాహన తనిఖీలు కొనసాగిస్తున్నారు.

గతేడాది అమలాపురంలో గంజాయి మత్తులో ఉన్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టుచేశారు. ముమ్మిడివరంలో గంజాయి చిల్లరగా అమ్ముతున్న ముమ్మిడివరం, ఆత్రేయపురం, రావులపాలెం ప్రాంతాల యువకులు గతంలో పోలీసులకు చిక్కారు. కాకినాడ పోలీసులు గతేడాది 15 ఎండిఎంఎ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడలోని విద్యాలయాలు, వసతిగృహాల్లో తనిఖీలు, విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించడం గతి తప్పుతున్న పరిస్థితిని స్పష్టం చేస్తోంది. మత్తుకు బానిసలై ఒత్తిడి, అనారోగ్యానికి గురవడం, చదువులో వెనుకబాటు, నేరాలకు పాల్పడటం వంటివి వెలుగుచూస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 'నషా ముక్త్ భారత్ అభియాన్' కింద అవగాహన చర్యలు చేపడుతోంది. బాధితులకు కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలోని వ్యసన విముక్తి కేంద్రాల్లో కౌన్సెలింగ్, వైద్యం అందిస్తున్నారు.



కొంతమంది పిల్లల్లో పెరిగిపోతున్న నేర ప్రవృత్తి ఆందోళనకర పరిణామాలకు దారి తీస్తోంది. వారిపై ఇంటర్‌నెట్ తీవ్ర ప్రభావం చూపుతోంది. అంతేకాదు.. మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు లేత మనసులను కలుషితం చేస్తున్నాయి. నిషేధిత మత్తు పదార్థాలు పాఠశాలల పిల్లలకూ అందుబాటులోకి వచ్చేయడంతో ఎంతోమంది దారి తప్పి.. వాటికి బానిసలుగా మారి.. కన్నవారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఇందులో కొందరు అసాంఘిక, అరాచక శక్తులుగా మారుతున్నారు. తోటి విద్యార్థులను శత్రువులుగా పరిగణిస్తూ.. విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారు. ఆడుతూ.. పాడుతూ.. సాగాల్సిన బాల్యాన్ని నేరమయం చేసుకుంటున్నారు. చిన్నచిన్న విషయాలకే ఆవేశపడి విచక్షణ కోల్పోయి.. నియంత్రణ లేక దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల మలికిపురంలో జరిగిన దాడి వెనుక ఇలాంటి బలమైన అనుమానాలే ఉన్నాయి.

### నేరస్వభావానికి ఆన్‌లైన్ ఆటలతో బీజం

పేరొందిన కార్పొరేట్ విద్యాసంస్థల వైఖరి ఇలా ఉంటే... చిన్నా చితకా ప్రైవేటు విద్యాసంస్థలు ఇంకో రకం. ఇక్కడ బోధనాపరమైన శిక్షణ లేని అధ్యాపకులు ఎందరో! వీరివల్ల మానసిక అభివద్ధికి అడుగులు పడతాయని చెప్పలేం. ఇక ప్రభుత్వ పాఠశాలలో బోధనా ప్రావీణ్యత ఉన్నా, ఇతర బాధ్యతల కారణంగా ఉపాధ్యాయులు తూతూమంత్రంగా బోధనను ముగిస్తున్నారనేది కాదనలేని సత్యం. మరోవైపు టివి, సినిమా, వీడియో గేమ్స్ ద్వారా చిరుప్రాయంలోనే మనసుకెక్కుతున్న హింస, అశ్లీల దశ్యాలు మానసిక ఉన్మాద ప్రవృత్తికి బీజం వేస్తాయి. పెద్దయ్యాక మానసిక రోగులుగా పరివర్తన చెంది, సామాజిక వ్యతిరేకులుగా, నేరస్తులుగా మారతారు.

### పిల్లలపై మత్తు పదార్థాల ప్రభావమిలా..!

మత్తు పదార్థాలు తీసుకున్నవారిలో ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. ఏది నచ్చితే అదే చేస్తారు. అది తప్పు అని గ్రహించలేరు. ఆలోచనలపై నియంత్రణ ఉండదు. విపరీతమైన కోపం ఉంటుంది. ఈ స్థితిలో కుటుంబ సభ్యులా? బయటవారా? అన్న తేడా తెలియకుండా ప్రవర్తిస్తారు. కోపంలో ఏది పడితే అది చేసేస్తారు. అందులోనే మజా వెతుక్కుంటారు. చేతిలో డబ్బు లేకపోతే దాని కోసం ఎంతటి నేరానికైనా సిద్ధపడతారు. అసభ్యంగా ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నవారూ ఉన్నారు.

### బాల్యం నుంచీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మనో వికాసానికి బాల్యంలోనే పునాదులు వేయాలి. తల్లిదండ్రులిద్దరూ మంచి బట్టలు, స్కూల్, సౌకర్యాలను అందివ్వడం మాత్రమే కాక పిల్లలతో తమ సమయాన్ని ఎక్కువగా గడపాలి. వారికి సామాజిక అవగాహనను పెంపొందించే విధంగా వివిధ రకాల అంశాలను నీతి కథల రూపంలో చెప్పాలి. పిల్లలు ఏ అంశాల పట్ల ఆకర్షితులవుతున్నారనే దాన్ని గమనిస్తూ ఉండాలి. ఉపాధ్యాయులు సైతం పిల్లల మనోవికాసానికి సంబంధించిన వివిధ విజ్ఞానపరమైన అంశాలను సరళమైన విధానంలో వారి మనసులకు హత్తుకునే విధంగా బోధించాలి. మోతాదుకు మించి అసహజ ప్రవర్తన కలిగి ఉంటే ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల దష్టికి తీసుకొని వెళ్లాలి.

**- వై.సత్య విజయ ప్రసాద్, సైకాలజీ కౌన్సెలర్ అమలాపురం.**



### పక్కదారి పట్టాక కౌన్సెలింగ్‌కు వస్తున్నారు

పిల్లల చేతికి గంటల తరబడి ఫోన్లు ఇస్తున్న తల్లిదండ్రులు... వారేం చూస్తున్నారో.. ఏం చేస్తున్నారో పట్టించుకోవడం లేదు. చూడకూడని వీడియోలు, సినిమాలు చూస్తూ వారి మనసులను నియంత్రించుకోలేకపోతున్నారు. పిల్లలు పూర్తిగా పక్కదారి పట్టాకే తల్లిదండ్రులు కౌన్సెలింగ్ కోసం తీసుకొస్తున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి విచక్షణ కోల్పోతున్నారు. తప్పని వారికి తెలియదు. పర్యవసానాలూ ఆలోచించడం లేదు.

**- నరేష్ కుమార్, సిఐ ,రాజోలు.**

## సమన్వయంతో అర్జీల పరిష్కారం : కలెక్టర్

**ప్రజాశక్తి-అమలాపురం**

జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని పటిష్ట పర్యవేక్షణతో అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కార మార్గాలు పూర్తిస్థాయిలో చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ డిఆర్‌డిఎ పీడీ శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఐసిడిఎస్ పీడీ ఎం.ఝాన్సీ రాణి అర్జీదారుల నుండి సుమారు 191 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కార మార్గాలు నాణ్యతతో చూపుతూ రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అర్జీదారుల ఫిర్యాదుల పట్ల క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి నిబంధనల మేరకు తగు పరిష్కార మార్గాలు అర్జీదారుడు సంతప్తి చెందే స్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. ప్రభుత్వ మూడంచెల విధానంలో సంతృప్తి స్థాయిలను నిరంతరం పర్యవేక్షిస్తుందని, కావున ప్రతి అధికారీ అర్జీలను క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించి సమస్యకు ఖచ్చితమైన పరిష్కార మార్గాలు చూపాలని ఆయన స్పష్టం చేశారు. గడువు దాటిన అర్జీలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఒకసారి దరఖాస్తు చేసిన అర్జీ మరలా అదే అంశంపై పునరావతం కాకుండా పరిష్కారాన్ని నాణ్యతతో చూపాలని ఆయన అధికారులకు సూచించారు. అన్ని రకాల అర్జీల పరిష్కార సరళిపై కూడా ప్రత్యేక ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. నిబంధన మేరకు పరిష్కార మార్గాలు పూర్తి స్థాయిలో చూపి మీకోసం కార్యక్రమం నిర్వహణ, పనితీరు పట్ల అర్జీదారుల్లో విశ్వసనీయతను పెంపొందించాలన్నారు. జిల్లాలో టాటా ఇన్సూరెన్స్ కంపెనీకి రైతులు ఎకరాకు రూ.630 చెల్లించాలని, ఈ పథకానికి గడువు ఈ నెలాఖరు వరకు మాత్రమే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కృష్ణారెడ్డి, సిపిఒ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసుబాబు, ట్రాన్స్‌కో ఎస్ఇ ఎస్.రాజబాబు, ఎల్‌డిఎం కేశవ వర్మ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి పి.జ్యోతిలక్ష్మి దేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, జిఎస్‌డబ్ల్యుఎస్ కో ఆర్డినేటర్ ఎస్.త్రినాథరావు, కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ ఎడి కె.విశాలాక్షి, పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

## 17, 18 తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభ

**ప్రజాశక్తి-అమలాపురం**

17, 18 తేదీల్లో సిపిఎం జిల్లా ప్రథమ మహాసభలు నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో ఈ సభలు నిర్వహిస్తామని తెలిపారు. 18న గడియారస్తంభం సెంటర్ వద్ద సాయంత్రం 3 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ బహిరంగ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు అంద్ర మాల్యాద్రి, బి.బలరాం పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని, భవిష్యత్తు కర్తవ్యాలు, నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

## దుర్గా ప్రసాద్ హత్య కేసును వేగంగా విచారించాలి

**ప్రజాశక్తి-అమలాపురం**

వాలంటీర్ జనిపెల్లి దుర్గా ప్రసాద్ హత్య కేసులో విచారణను వేగవంతం చేయాలని దుర్గాప్రసాద్ భార్య శ్రావణి సంధ్య కోరారు. సోమవారం కలెక్టర్, ఎస్పి కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రాలు అందించారు. ఈ కేసులో పినిపే శ్రీకాంత్, వడ్డి ధర్మేష్‌తో పాటు నలుగురు నిందుతులుగా పోలీసులు పేర్కొన్నారని, ఇద్దరికి విచారణ పూర్తి కాకుండానే బెయిల్ కూడా మంజూరయ్యిందని తెలిపారు. కేసులో నిందుతునిగా ఉన్న చేట్ల జానీ జోసెఫ్ (జానీ) అమలాపురం రౌడీ షీటర్ జయన సత్తిరాజు అనుచరుడని తెలిపారు. అతడి పాత్రపైనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ ఉన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి-ఉప్పలగుప్తం**

విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన బాధ్యతను నిర్వర్తిస్తానని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి తెలిపారు. భీమనపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలను సోమవారం ఎంఎల్‌సి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి గోపి మూర్తి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాలలో మంచి ఉత్తీర్ణత సాధించడానికి ఉన్నతమైన విద్య విద్యార్థులకు అందించేందుకు ఉత్తమ బోధన చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారాన్ని కృషి చేస్తానన్నారు. ఆయన వెంట యూటిఎఫ్ నాయకులు ఎ.సురేష్ కుమార్, ఎన్.పద్మనాభన్, కె.మధుసూదనరావు, జి.సుబ్రహ్మణ్యం ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, నూకల సత్యనారాయణ, ఉపాధ్యాయులు అరవ స్వామి నాయుడు, రాయి వెంకటేశ్వరరావు ఉన్నారు.



ఎంఎల్‌సి గోపి మూర్తిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## పది పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి

**ప్రజాశక్తి ముమ్మిడివరం**

రాబోవు పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని డిఇఒ షేక్ సలీం బాషా సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని విద్యాశాఖ కార్యాలయంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, జిల్లా డిజిగ్నేటెడ్ అధికారులు, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ తదితర అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి డిఇఒ బాషా మాట్లాడారు. పది పరీక్షల్లో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపే విధంగా ప్రణాళికలను రూపొందించాలని, ప్రతి సబ్జెక్టులోనూ అనుభవజ్ఞులతో వీడియో పాఠాలు చెప్పించడం ద్వారా విద్యార్థుల మనసుల్లో గుర్తుండే విధంగా మార్గదర్శకాలను సిద్ధం చేయాలని సూచించారు. అటల్ ల్యాబ్ వర్క్ షాపుల ద్వారా విరివిగా తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించే విధంగా సైన్స్ ఫెయిర్స్ నిర్వహించి, విద్యార్థులు వాటిలో పాల్గొనే విధంగా చేయడమే కాక, బడ్జెట్ కేటాయించాలని, చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే చర్యలు కొనసాగించాలని, విద్యార్థులను పర్యావరణ పరిరక్షణ కార్యకలాపాల్లో భాగస్వాములను చేయడం ద్వారా ప్రకతి పట్ల ఆసక్తిని పెంపొందించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎడి1 నాగేశ్వరరావు, ఎడి2 సురేష్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాశం, కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ హనుమంతరావు, సమగ్ర శిక్ష కమ్యూనిటీ మోబిలైజేషన్ అధికారి బి.సుబ్రమణ్యం, జిల్లా సైన్స్ అధికారి జి.సుబ్రమణ్యం, నేషనల్ గ్రీన్ కార్ప్ కో ఆర్డినేటర్ ప్రభావతి, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ సాయి, సెక్టోరియల్ అధికారి రమేష్, ఐటి స్టాఫ్ తాతారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ షేక్ సలీమ్ బాషా

## గోదావరిలో మొసలి కలకలం

**ప్రజాశక్తి-ఆత్రేయపురం**

లొల్ల గ్రామం వద్ద గోదావరి నదిలో మొసలి సంచరించడంతో ఆ ప్రాంత రైతులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం గ్రామానికి చెందిన దాట్ల సత్తిరాజు పశువులను తోలుకొని గౌతమి గోదావరి నదీ తీరాన వెళ్లారు. ఒక మొసలి ఒడ్డున పైకి వచ్చి ఉండడంతో రైతు చూసి భయాందోళన చెందాడు. అలికిడి విని మొసలి గౌతమి గోదావరి నదిలోకి వెళ్లిపోయింది. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. నది ఒడ్డున శ్మశాన వాటిక ఉండడంతో ఎవరైనా మృతి చెందితే వారిని ఖననం చేసేందుకు ఈ ప్రదేశానికి తీసుకెళ్తారు. గోదావరి నది పాయలో స్నానం చేయాలంటనే ఆడలెత్తిపోతున్నారు.

## సిఎం సహాయ నిధి నుంచి సాయం

**ప్రజాశక్తి-కె.గంగవరం**

అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వ్యక్తికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి రూ.30 వేలు మంజూరయ్యాయి. ఈ మొత్తం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఆయన ఇంటి వద్ద అందించారు. కె.గంగవరం మండలం బ్రహ్మపురి గ్రామానికి చెందిన మేడ ఏడుకొండలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మెరుగైన వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వ ముఖ్యమంత్రి నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారి అనారోగ్య సమస్యలను గుర్తించిన ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కుల రూపంలో రూ.30 వేలు విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి

## గణిత పోటీల్లో వివేకానంద విద్యార్థుల ప్రతిభ


**ప్రజాశక్తి-రామచంద్రపురం**

రామానుజన్ గణిత అకాడమీ నిర్వహించిన పోటీ పరీక్షల్లో రామచంద్రపురం పట్టణానికి చెందిన వివేకానంద స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. స్థానికంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రథమ విజేతగా ఎన్.సూర్యమానస్ పి.ప్రాకతి ద్వితీయ స్థానం సాధించారు. ఈ మేరకు సోమవారం విజేత బహుమతులు అందజేశారు. గణిత సేవా సంస్థ రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కెవివి.సత్యనారాయణ, ఐటిటి, ఖరగ్‌పూర్ నుంచి వచ్చిన మూర్తి మ్యాథమెటిక లేబరేటర్ నుంచి చంద్రశేఖర శాస్త్రి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వివేకానంద స్కూల్ డైరెక్టర్ బిఎఎస్ సరోజిని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.శైలూష మాట్లాడారు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ వల్ల విద్యార్థుల్లో మేధో సంపత్తి పెరుగుతుందని తెలిపారు. వారిలో సజనాత్మకత, వెలికి తీసే అవకాశం ఉందని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపల్స్, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థి సూర్య మానస్

### కార్టూ'నిజం'




## ప్రతిష్టాత్మకంగా బీచ్ వాలీబాల్ పోటీలు

**ప్రజాశక్తి-ఉప్పలగుప్తం**

ఎస్.యానాం బీచ్‌లో జాతీయస్థాయి మహిళా బీచ్ వాలీబాల్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే ఈ పోటీల నిర్వహణ పనులకు సోమవారం బీచ్‌లో ఆర్‌డిఒ, కె.మాధవితో కలిసి ఎంఎల్‌ఎ ఆనందరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే అన్నింటికీ అనువైన ఎస్.యానాం బీచ్ అభివృద్ధికి తాను కృషి చేస్తున్నట్టు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ వాలీబాల్ పోటీలను క్రీడాభిమానులు విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ వాలీబాల్ పోటీల్లో మన రాష్ట్రంతో పాటు గోవా, గుజరాత్, కేరళ, వెస్ట్ బెంగాల్, పాండిచ్చేరి, తమిళనాడు, ఒడిషా రాష్ట్రాలకు చెందిన మహిళా వాలీబాల్ క్రీడాకార జట్లు పాల్గొంటాయన్నారు. రానున్న రోజుల్లో ఎస్.యానం బీచ్ అందమైన పర్యాటక కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎంఎల్‌ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విఎస్.దివాకర్, పిఆర్ డిఇ పిఎస్.రాజ్ కుమార్, పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మాజీ సర్పంచ్ పినిశెట్టి నరసింహారావు, లంకే భీమరాజు, మాజీ జెడ్‌పిటిసి దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు దంగేటి వెంకటరెడ్డి నాయుడు(చిట్టిబాబు), పెచ్చెట్టి చంద్రమౌళి, పలచోళ్ల పద్మనాభం, అయితాబత్తుల అజయ్ సింగ్, సత్తి చిన్న, మంచెం బాబీ, చీకట్ల శ్రీను పాల్గొన్నారు.



బీచ్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు, ఆర్‌డిఒ కె.మాధవి

### మహిళా బీచ్ వాలీబాల్ అసోసియేషన్ ఏర్పాటు

మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎస్.యానాం బీచ్ వాలీబాల్ టోర్నమెంట్ అసోసియేషన్ ఏర్పాటయ్యింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షునిగా ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు, అధ్యక్షులుగా పలచోళ్ల పద్మనాభం, ఉపాధ్యక్షునిగా లంకే భీమరాజు, సంయుక్త కార్యదర్శిగా అయితాబత్తుల అజయ్ సింగ్, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, కార్యనిర్వహణ కార్యదర్శిగా పీడీ గొలకోటి ఫణీంద్ర కుమార్, సభ్యులుగా ఎం.వెంకటేశ్వరరావు డి.శ్రీనివాసరాజు, పివివి నాగేశ్వరరావు, ఎ.నరేష్‌ను నియమించారు.

## కళాశాల భవనం నిర్మించాలని ధర్నా


**ప్రజాశక్తి - ఆలమూరు**

ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరుకుని 20 ఏళ్లు దాటిందని, వెంటనే నూతన భవనం నిర్మించాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్స్ రోజు రోజుకీ తగ్గుతూ వస్తున్నాయని, 12 గ్రామాల పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఈ ప్రభుత్వ కళాశాలను కాపాడుకోవాలన్నారు. ఎప్పుడు కూలిపోతాయో తెలియని, బీటలు వాలిన గోడలు మధ్య విద్యార్థులకు రక్షణ లేదన్నారు. ఎటువంటి ప్రమాదాలూ జరగకముందే, కళాశాల నూతన భవన నిర్మాణం చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న పిఇటి పోస్ట్ భర్తీ చేసి ఆటస్థలం అభివద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కళాశాల సరిహద్దులు సర్వే చేయించి కబ్జా దారుల నుంచి కాపాడి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత విద్య కల్పించే ప్రభుత్వం, విద్యాలయాలు అభివృద్ధి చేయకపోవడం వల్ల విద్యార్థులు అప్పులు చేసి ప్రైవేట్ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కొందరు విద్యార్థులు చదువుకు స్వస్తి చెప్పి కూలి పనులకి వెళ్తున్నారని, వెంటనే విద్యార్థులకు మౌలిక సదుపాయాలుతో కూడిన కళాశాల భవనం వెంటనే నిర్మించాలి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు చిరు, ఉదయ్, వినయ్, లావణ్య, తదితర వందలాది విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




కాలేజ్ ఎదుట రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

## నేరాలు ఘోరాలు



సమావేశంలో పాల్గొన్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు

## ఉప్పుటేరులోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

శీలావారిపాలెం వద్ద ఉన్న వంతెన పైనుంచి ఉప్పుటేరులోకి సోమవారం ఒక కారు దూసుకుపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండంగి మండలానికి చెందిన స్విఫ్ట్ కారు కాకినాడ వైపు వెళ్తుండగా శీలావారిపాలెం వద్ద ఉన్న వంతెనకు ఇరువైపులా గోడలు లేకపోవడంతో అదుపుతప్పి ఉప్పుటేరులోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## ట్రాక్టర్ కింద పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఇటుకలు తయారు చేసే మట్టిలో కూరుకుపోయిన ట్రాక్టర్‌ను తీస్తుండగా అదే ట్రాక్టర్ కింద పడి ఇటుక బట్టీ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన తాళ్లపూడి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని తిరుగుడు మెట్ట గ్రామానికి చెందిన దువ్వల రాజు ఇటుక బట్టీలో కార్మికునిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఎప్పటి లాగే పనికి వెళ్లాడు. బల్లిపాడు, పెద్దేవం గ్రామాల మధ్య ఇటుక బట్టీలో ట్రాక్టర్ కురుకుపోగా దీనిని తీయడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు అదే ట్రాక్టర్ కింద పడి మరణించాడు. ఘటనా ప్రాంతాన్ని ఎస్ఐ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టిడిపి నాయకులు అన్నమరెడ్డి సత్తిబాబు తదితరులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు.

## రేబిస్‌తో వ్యక్తి మరణం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కుక్క కరవడంతో రేబిస్ వ్యాధికి గురై చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్రేయపురం కుమ్మర వీధికి చెందిన మానేపల్లి దుర్గాప్రసాద్ (37) ఆర్టీసిలో ప్రైవేటు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మూడు నెల క్రితం రాత్రి సమయంలో తన ఇంటి వద్ద ఉండగా ఓ కుక్క చేతిపై కరవడంతో దుర్గాప్రసాద్ ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స పొందాడు. ఈ నెల 14న ఆరోగ్యం సరిగా లేనందున కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించి రాబిస్ వ్యాధి సోకినట్లు గుర్తించారు. పరిస్థితి విషమించడంతో దుర్గాప్రసాద్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.



సభలో పనుల వివరాలను నివేదిస్తున్న డిఆర్‌పి శ్యామ్

## మాచర్లో ఉపాధి హామీ గ్రామ సభ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని మాచర గ్రామ పంచాయతీ కార్యాలయ వద్ద సోమవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వాసంశెట్టి సునీత విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన ఉపాధి హామీ తనిఖీ గ్రామసభలో ఎస్ఆర్పిఇ కనకారావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిఆర్‌పి శ్యామ్ గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో సేకరించిన పనుల వివరాలను సభలో చదివి వినిపించారు. ఈ గ్రామ సభలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, ఉప సర్పంచ్ అడపా వేణు, వాసంశెట్టి విష్ణుమూర్తి, ఎంఇఒ కె.తాతారావు, ఎస్ఆర్ఏ, జెఇ ఎస్.ఎచి. రవి కిరణ్, జెఇ పి.శరత్ సింగ్, టెక్నికల్ అసిస్టెంట్ జె.లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ శివకుమార్, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

## అమ్మవారికి సారె సమర్పణ

ప్రజాశక్తి - అంబాజీపేట

మాచవరంలోని ఇదికాలమ్మ, మహలక్ష్మి అమ్మవార్లకు భవాని మాలధారులు దంగేటి సాయిబాబు-మల్లేశ్వరి దంపతులు, మట్టపర్తి దుర్గారావు, మట్టపర్తి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం సారె సమర్పించారు. పోతాలంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి గ్రామ ఆడపడుచులు కలసి అమ్మవార్లకు చలివిడి పానకాలు, పసుపు కుంకుమలు, చీరలు, స్వీట్లు, బూరెలు, గారెలతో మేళతాళాలు, ర్యాలీగా తరలి వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్యం గురువాణి, కోల దొరబాబు గురుప్రసాద్, సూరి కుమారి, తేతా దొరబాబు, మట్టపర్తి శ్రీనివాస్, సుబ్బారెడ్డి, యండ శ్రీను, పాటి శేఖర్ పాల్గొన్నారు.

## పిఆర్‌టియు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -మామిడికుదురు

పిఆర్‌టియు జిల్లా, మండల కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి మామిడికుదురు హైస్కూల్ ప్రాంగణంలో ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మట్ట కృష్ణయ్య పరిశీలకునిగా, జిల్లా అధ్యక్షుడు పెద్ద రాజారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా కుంచె కృష్ణ కుమార్, ప్రధాన కార్యదర్శిగా దీపాటి సురేష్ బాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మెగం అమృతరావు, గౌరవ కార్యదర్శిగా కంకటాల చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లుగా పెంపం బ్రహ్మాజీరావు, ఎరుబండి వెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు. మామిడికుదురు మండల అధ్యక్షునిగా యాళ్ల పల్లంరాజు, ప్రధాన కార్యదర్శిగా చింతా రమేష్, గౌరవాధ్యక్షునిగా పొన్నపల్లి వెంకటేశ్వరరావు, ఆర్థిక శాఖ కార్యదర్శిగా పెద్దిరెడ్డి నరసింహమూర్తి, జిల్లా కౌన్సిలర్లుగా కెవిడి.ప్రసాద్, మట్ట శ్రీనివాసరావు, మాగాపు విజయ దుర్గారావు, ముత్యాల వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## యానాం వార్తలు



సమావేశంలో పాల్గొన్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు

## పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు తొలిసారిగా సోమవారం యానాంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకౌంట్స్ ఛైర్మన్, ఎఎల్ఎ కెఎస్‌పి.రమేష్ ఆధ్వర్యంలో ఆడిట్ సెన్సిటైజేషన్ ప్రోగ్రాం జరిగింది. ఈ సమావేశంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులతో పాటు అంచనాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పుదుచ్చేరి అసెంబ్లీలోని వివిధ పార్టీలైన ఎన్ఆర్ కాంగ్రెస్, బిజెపి, కాంగ్రెస్, డిఎంకె తదితర పార్టీలకు చెందిన ఎంఎల్ఎలు, స్పీకర్ ఆర్ సెల్వం, డిప్యూటీ స్పీకర్ రాజు వేలు, స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. ముందుగా కమిటీ సభ్యులను ఆర్ఎఒ మునిస్వామి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బంకుల వద్ద తనిఖీ వివరాలు తప్పనిసరి

ప్రజాశక్తి - యానాం

పెట్రోల్ బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొట్టే పంపులపై రోజువారీ తనిఖీ వివరాలు తప్పనిసరిగా పొందుపరచాలని తూనికలు కొలతల శాఖ డిప్యూటీ తహశీల్దారు గణేషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు కచ్చితమైన పరిమాణంలో పెట్రోలు, డీజిల్ నింపుతున్నది లేనిది 5 లీటర్లు, 10 లీటర్ల డబ్బాలతో వేసి ప్రతి రోజు పరీక్షించాలన్నారు. ఒక బంకులో తనిఖీ చేసిన సందర్భంగా 10 లీటర్ల పెట్రోల్‌ను పరిశీలించగా తక్కువ పరిమాణం పెట్రోల్ రావడంతో రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు.



జనసేన నేత శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పాపారావు

## శివాలయాన్ని సందర్శించిన శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలోని విక్రమ బట్టీశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు సందర్శించి, స్వామిని దర్శించుకున్నారు. శ్రీనివాస్‌కు పండితులు కాళ్ళకూరి సూరిపండు, నరేంద్ర సాదర స్వాగతం పలికారు. 15 ఏళ్లుగా శివ ముక్కోటి సందర్భంగా స్వామికి అన్నాభిషేకం, యాత్రికులకు అన్నదానం నిర్వహిస్తారని అర్చకులు బండారు శ్రీనివాస్ కు తెలిపారు. ఈ పురాతన ఆలయాన్ని సందర్శించడం ఆనందదాయకమని బండారు శ్రీనివాస్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భట్టీశ్వరునికి బండారు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రముఖ పారిశ్రామికవేత్త, కొత్తపేట నియోజకవర్గం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు ఆధ్వర్యంలో శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సూరపరెడ్డి సత్య, కొత్తపల్లి నగేష్, గారపాటి శ్రీనివాస్, బండారు బాబి, వైట్ల సత్యనారాయణ, సిరినీడి పట్టాభి, చల్లా వెంకటేశ్వరరావు, చల్లా బాబి, కర్రి సత్యనారాయణ, బలగం శివ, పట్టా రాజు, డిపి.రావు, చీకట్ల సతీష్, రాజాని సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

## బాబా నగర్ కాలనీలో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-మామిడికుదురు

దోమల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లూటుకుర్రు పిహెచ్‌సి ఆధ్వర్యంలో మాకన్నపాలెం బాబా నగర్ కాలనీలో సోమవారం ఎబేట్ మందు స్ప్రే చేయించామని హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. దోమల వల్ల వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతంగా జీవించవచ్చన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఎస్.అరుణ, ఎఎన్ఎం వై.లావణ్య, ఆశ వర్కర్ కెడిఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక కవి సమ్మేళనంలో పాలమూరికి సన్మానం

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేటకు చెందిన సామాజిక సహజకవి జాతీయ పురస్కార గ్రహీత వెంకట్ పాలమూరిని కర్నూలు జిల్లా మంత్రాలయంలో పరిమళ విద్యానికేతన్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన 142వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో ఘనంగా సత్కరించారు. సంస్థ సిఇఒ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆయనను సత్కరించారు. 'దేవుడా ఏమిటీ మాయ' కవితా గానానికి ఈ సన్మానం చేసినట్టు తెలిపారు. దీంతో సోమవారం ఆయనను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కొల్లి రామావతి, జి.ఈశ్వరి భూషణం, డాక్టర్ కె.పార్థసారథి పాల్గొన్నారు.

## అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17, 18 తేదీల్లో ఆర్‌జిఎస్ఎ కార్యాచరణ ప్రణాళిక 2025-26 సుస్థిరమైన స్థిరమైన అభివద్ధి లక్ష్యాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ జివి.సరోవరరావు తెలిపారు. మండల పరిధిలో అన్ని గ్రామాల సర్పంచులు, లైన్ డిపార్ట్‌మెంట్ సభ్యులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఫంక్షనరీలు, తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## పూర్వ విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి ముమ్మిడివరం

కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన పూర్వ విద్యార్థినికి రూ.26 వేల ఆర్థికసాయం అందించి దాతత్వం చాటుకున్నారు. మండలంలోని గేదెల్లంక గ్రామానికి చెందిన గుత్తాల శ్రీనివాసరావు కుమార్తె పుట్టుకతోనే కిడ్నీ సమస్యతో బాధ పడుతోంది. గేదెల్లంక పాఠశాలలో పది వరకు చదువుకున్న అశ్వినికి కిడ్నీ పూర్తిగా పాడై, రోజు విడిచి రోజు డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి. నిరుపేద కుటుంబానికి చెందిన బాధిత పూర్వ విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సమకూర్చిన రూ.26 వేలను సోమవారం గ్రామానికి చెందిన కోలా బాబ్జి, గుద్దటి జమి అందజేశారు.

## ఘనంగా శ్యామ్ పుట్టినరోజు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

టిడిపి బండారులంక గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ పుట్టిన రోజు వేడుక సోమవారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శ్యామ్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో సెక్రెటరీ శ్రీనివాసరావు, గుమస్తా సత్యనారాయణ రాజు, బిల్లు కలెక్టరు రాంబాబు, ససివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తునట్టు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. సోమవారం పలుచోట్ల సదస్సులు నిర్వహించారు.**

ప్రజాశక్తి - యంత్రాంగం

**ఆలమూరు** రెవెన్యూ సంబధిత సమస్యలతో పాటు అర్హులైన లబ్ధిదారులు అందరికీ సంక్షేమ పథకాలను అందజేసేందుకు ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు కెజె.ప్రకాష్ బాబు, ఎంపిడిఒ ఐ.రాజు అన్నారు. చింతలూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తొలుత గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సభలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. నిర్ణీత సమయంలో దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు, నూకాంబిక ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు, ఆర్ఐ టి.రామాయమ్మ, మండల సర్వేయర్ ప్రభావతి, కార్యదర్శి వి.వేణి, విఆర్వో రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి పుట్టపూడి వీరవెంకట సూర్యనారాయణ అన్నారు. మండలంలోని నిడసనమెట్టలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. అనంతరం తహశీల్దారు చిన్నారావు మాట్లాడుతూ భూసమస్యలపై రైతులకు అభ్యంతరాలు ఉన్నట్లయితే దరఖాస్తులు చేసుకుంటే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైతుల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేశారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పి.వెంకటేశులు, ఆర్ఐ అజ్జమ్మ, విఆర్ఒలు ఉమా మహేశ్వర రావు, షేక్ అబ్దుల్ కరీమ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**అమలాపురం రూరల్** పేరూరు గ్రామపంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ దాసరి అరుణ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ కిషోర్‌బాబు పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించడానికి ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పేరూరు, చిందాడగరువు, రోళ్లపాలెంలో ప్రజలు పలు భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాస్, పాల్గొన్నారు.



అమలాపురం రూరల్ పేరూరు రెవెన్యూ సదస్సులో పాల్గొన్న సర్పంచ్



కపిలేశ్వరపురంలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు



ఆలమూరు మండలం చింతలూరులో పర్యటిస్తున్న అధికారులు

# సామాజిక రుగ్మతలపై భీమన్న పోరాటం

ప్రజాశక్తి -మామిడికుదురు

తన రచనలతో సామాజిక రుగ్మతలపై డాక్టర్ బోయి భీమన్న ఎనలేని పోరాటం చేశారని మాజీ ఎంఎల్ఎ ఎంఎ.వేమా అన్నారు. మామిడికుదురులో డాక్టర్ బోయి భీమన్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో భీమన్న 19వ వర్ధంతి సందర్భంగా సోమవారం భీమన్న కాంస్య విగ్రహానికి వేమా పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమన్న రచన గుడిసెలు కాలిపోతున్నై కవితతో పద్మభూషణ్ అందుకున్నారని అన్నారు. ముఖ్యంగా పేద దళిత కుటుంబాల్లో పాలేరు నాటకంతో చైతన్య వంతులలను చేశారని కొనియాడారు. గెయిల్ స్కిల్స్ మేనేజర్ సురేష్, సత్యనారాయణ, గంటి చంద్రశేఖర్ శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.



భీమన్నకు నివాళులు అర్పిస్తున్న అయ్యాజీ వేమా

# మాలల మహాగర్జన విజయవంతం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్‌సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆదివారం గుంటూరు నల్లపాడులో నిర్వహించిన మాల మహా గర్జన విజయవంతమైందని మాల మహానాడు నాయకులు తెలిపారు. ఎస్.కొత్తపల్లిలో సోమవారం మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. దళితులలో వర్గాలను ఏర్పాటు చేసి మాల మాదిగలను విడదీయాలని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రయత్నిస్తే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. మాల మహాగర్జన విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సమావేశంలో కుంచే చిన్ని, గిడ్ల రమేష్, కొంకి బాలకృష్ణ, గోసంగి శ్రీనివాసరావు, నందిక రమేష్, కొంకి రాంబాబు, మాదే చిన్ని, నందిక ప్రసాద్ పాల్గొన్నారు.

## పిజిడిఎంలో దేవులపల్లికి బంగారు పతకం

ప్రజాశక్తి - పెద్దాపురం

తెలంగాణ రాష్ట్రంలో విద్య నభ్యసిస్తున్న పెద్దాపురం వాసి దేవులపల్లి సాయి వెంకటశాస్త్రి పీజీడిఎంలో బంగారు పతకం సాధించాడు. పెద్దాపురం రామారావుపేటకు చెందిన న్యాయవాది దేవులపల్లి వెంకట శాస్త్రి మనుమడు, దేవులపల్లి ప్రకాశరావు, ఉమాదేవి దంపతుల కుమారుడైన సాయి వెంకటశాస్త్రి హైదరాబాదులో విద్యనభ్యసిస్తున్నాడు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులో 2024 బ్యాచ్‌కు చెందిన సాయి వెంకటశాస్త్రి హైదరాబాద్‌లో జరిగిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపిఇ)లో బంగారు పతకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా పలువురు సాయి వెంకటశాస్త్రిని అభినందించారు.

# ఉచిత ఇసుక అందించాలని వినతి

ప్రజాశక్తి- మామిడికుదురు

వైనతేయనదీ తీరాన ఉన్న పెదపట్నంర్యాంపు నుంచి పక్క గ్రామమైన నగరం వాసులకు ఇసుక సరపరా చేసేలా చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో తహశీల్దారు వైవి.సుబ్రహ్మణ్యాచార్యులకు నగరం వాసులు వినతిపత్రం అందజేశారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు, పంచాయతీరాజ్ సిసి రోడ్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ద్వితీయ శ్రేణి నాయకులు పెత్తనం చెలాయిస్తూ ఇసుక వారిదేనని, నగరంకు ఇచ్చేది లేదంటూ కరాఖండిగా ఇసుక ఇవ్వటం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాటికాయల ఉదయ్ భాస్కర్, వి.శ్రీనివాసరావు, పి.నాగబాబు, బి.గంగా లక్ష్మి, ఎం.గోపిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నగరం వాసులు

# ఆర్‌డిఒ కార్యాలయంలో సమస్యలపై అర్జీలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి 5 దరఖాస్తులు వచ్చాయని ఆర్‌డిఒ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వాటిలో ఆక్రమణను తొలగించవలసినదిగా, వికలాంగుల పెన్షన్ పునరుద్ధరించాలని, గ్రామ రెవెన్యూ అధికారిపై తగు చర్య తీసుకోవాలని దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ అఖిల

# విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి

ప్రజాశక్తి కాట్రేనికోన

కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అయితాబత్తుల పండుబాబు ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం వెంటనే తగ్గించాలని గేట్ సెంటర్ నుంచి నినాదాలు చేసుకుంటూ తహశీల్దారు కార్యాలయానికి వెళ్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిడ్డి సత్యవతికి వినతిపత్రం అందించారు. పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ కన్వీనర్ పాలెపు ధర్మారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేద ప్రజలను మోసం చేసి విద్యుత్ ఛార్జీలు పెంచిందని, ట్రూఅప్ ఛార్జీల కింద అధిక భారం ప్రజలపై మోపారని, పేద ప్రజల నడ్డి విరిచి ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెప్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుస్తంభం సోనీ, అంగాని నాగరాజు, మల్లాడి గోపి, నవుడూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**పాస్‌పోర్టు పడిపోయినవి**

**టేకుమూడి ప్రశాంతి**, W/o. నాగ వీరమణికంఠ సాయి టేకుమూడి, డో.నెం.2-333/1, గుడాలసత్రం దగ్గర, మెయిన్‌రోడ్డు, చీడిగ, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్ అను పేరిట గల పాస్‌పోర్ట్ నెం. **V4833170**, dt.22-12-2021 కలది మా ఇంటి నుండి జిరాక్స్ నిమిత్తం ది.14-12-2024 తేదీన చీడిగ నేరేళ్ళమ్మతల్లి గుడి సెంటర్‌లో గల జిరాక్స్ షాపుకు బైక్‌పై వెళ్ళుచుండగా దారిలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు నా బ్యాగ్ నుండి జారి పడిపోయినది. కావున ఎవరికైన దొరికినచో ఈ క్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు.

**టేకుమూడి ప్రశాంతి**
సెల్: 8977901315

**ఒరిజినల్ దస్తావేజు పడిపోయినవి**

ఇండ్లు స్థలం ఒరిజినల్ దస్తావేజులు పడపోయినవి డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయిపాలెం/ వీరేశుగుళ్ళు నివాసస్థుడు కురుపూడి సత్యనాయాయణ మూర్తి S/o వెంకటేశ్వర్లు (లేటు) అను నేను 05-12-24 వీరేశుగుళ్ళు మా ఇంటివద్ద నుండి మోటారు సైకిల్ పై అనపర్తి మండలం అనపర్తి సావరం లో ఉన్న నాఇంటి స్థలం దస్తావేజు జిరాక్స్ తీయించుకొనుటకు "ఇందు జెరాక్స్" (ద్రాక్షారామ లావణ్య హోమ్‌నీడ్స్ ప్రక్కన) ఉన్న జెరాక్స్ షాపునందు ఫోటో స్టాట్స్ తీయించుకొని మరల మా ఇంటికి అనగా వీరేశుగుళ్ళు తిరిగి వెళ్ళు సమయంలో జరిజినల్ ఇంటి స్థలం దస్తావేజులు పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. నా దస్తావేజు **సర్వేనెం.805/2** అయివున్నది. కావున ఎవరికైన దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్‌కు తెచ్చిఇవ్వగలరు.

**కురుపూడి సత్యనారాయణమూర్తి**
S/o వెంకటేశ్వర్లు (లేటు)వీరేశుగుళ్ళు కాలనీ,
డోర్‌నెం.1-109/1,గ్రంధాలయం వద్ద,
వెంకటాయపాలెం. సెల్: 9576988986

**మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**E.A.No.563/2019in**
**O.S.No.77/2002**

బిట్విన్:-
వేగుళ్ళ చిట్టెమ్మ (డైడ్) అండ్ అదర్స్
...పిటిషనర్స్ / DHRS
And
సంకా సుబ్బలక్ష్మి అండ్ అదర్స్
...రెస్పాండెంట్స్ / JDRS

To
R1 సంకా సుబ్బలక్ష్మి @ నాగమణి W/o.(late) సత్యన్నారాయణమూర్తి, హిందూ, వయస్సు 70 సం॥లు, మండపేట(T) మండపేట మండలం, డా॥.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు, JCJC.

పై నెంబరు గల E.A.పిటీషనులో 1వ రెస్పాండెంట్ అయిన మీరు ఎన్ని మార్లు శ్రీ కోర్టు ద్వారా నోటీసులు పంపించినను మీరు అందుకొనక కాలయాపన చేయుచున్నారు. కాబట్టి శ్రీ కోర్టు వారు ది.20-12-2024 సం॥రం॥ తేదీ నాటికి మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. సదరు తేదీన మీరుశ్రీ పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కానీ ప్లీడరు వారి ద్వారా గాని హాజరై మీ వాదన దాఖలు చేసుకొనవలెను. అటుల హాజరు కాని పక్షంలో పై నెంబరు గల పిటీషనులో మీ పరోక్షమున తీర్మానించెదరు.

**వాయిదా. 20-12-2024**
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీబొడ్డపాటి.సురేష్‌కుమార్
రామచంద్రపురం అడ్వకేట్, రామచంద్రపురం
ది.12-12-2024 సెల్: 9908851159

**మహారాజశ్రీ కొవ్వూరు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో**
**EP 171/2019 AC 1440/2013**

Between:
M/s. శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, తాడేపల్లిగూడెం బ్రాంచి
Rep.by its Recovery Executive cum GPA Holder .... DHR
VS
శ్రీ సాధనాల వీర్రాజు వగైరా...
1st JDR: శ్రీ సాధనాల వీర్రాజు, S/o.రామయ్య, డోర్ నెం.6-333, యాదవోలు, దేవరపల్లి మండలం .... JDR

**వాయిదా: 31-12-2024**

ఈ నెంబరు EP ని 1st JDR కు గల ఆస్థి వేలం వేయించమని దాఖలు చేసిన EP లో 1st JDR అయిన మీకు కోర్టు ద్వారా, పోస్ట్ ద్వారా U/Order 21, Rule 54 of CPC నోటీసు పంపించియున్ననూ ఉద్దేశ్య పూర్వకముగా Avoid చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పై నెంబరు EP లో 1వ JDR అయిన మీరు పై కోర్టు వారి ఎదుట ది.31-12-2024న ఉదయం గం॥10.30 ని॥ల లగాయితు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. అట్లు కాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును. ఇది శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం జారీ చేయడమైనది.

M.S.S. **చక్రపాణి**,
కొవ్వూరు **అడ్వకేట్**, కొవ్వూరు.
ది.16-12-2024 సెల్: 93476 26845

**In the Court of the Vth Addl. District and Sessions Judge, Rajamahendravaram**
**M.V.O.P.329/2022**

Between:
Pothuraju Venkata Ramana
...Petitioner
And
Mandapaka DurgeshAnd others
...Respondents
R.2
Malladi Naga Padma, W/o. Dharmarao, Hindu, Aged 40 years, owner of the Auto Bearing No: AP 05 TK 0035, R/o. D.No: 8-94, Kotha Colony, I.Polavaram, East Godavari District-533220

పైన చూపబడిన R.2 కోర్టు ద్వారా ఎన్నిమార్లు నోటీసులు పంపినను తీసుకొనక తప్పించుకొనుచున్నందున పై కోర్టు ఆర్డరు ప్రకారము R.2 కోర్టు వారి ఎదుట **30-12-2024**వ తారీఖు ఉదయం **10.30** గం॥లకు ప్రత్యక్షముగా గాని వకీలు ద్వారా గాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలుపనిచో సదరు గ్రంథము వారికి పరోక్షముగా తీర్మానించబడును.

రాజమండ్రి కె.వరలక్ష్మి
ది16-12-2024 అడ్వకేట్,రాజమండ్రి

**మహారాజశ్రీ ఫ్యామిలి కోర్టు మరియు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం**
**I.A.No.96/2023in**
**O.S.No.14/2010**

**Between:**
Karri Venkata Reddy
**...Petitioner/Plaintiff**
And
Pulidindi Rata And Others
**...Respondents/Deffndants**
**01.** Pulidindi Ratna Kumari, W/o. late Veeraswamy, Hindu, aged 69 years, Jegurupadu Village, Kadiyam Mandal
**03.** Bathula Rajamani, Wo Stinivas, D/o late Veera Swamy Hindu, aged 55 years C/o. Ratna Kumari, Jegurupadu Vilage, Kadiyam Mandal
**04.** Pulidindi Mamatha Kumari, Wo RajaKumar, D/o late Veeraswamy, Hindu, aged 54 years, R/o. P.Ratna Kumari, Jegurupadu Village, Kadiyam Mandal

పై నంబరు పిటిషన్ 1,3,4, రెస్పాండెంట్లు/ప్రతివాద్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. **20-12-2024** సం॥రం తేది. ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లిడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **G.S.S.మురళీమోహన్**
15-12-2024 అడ్వకేట్,రాజమండ్రి

**పురపాలక సంఘ కార్యాలయం, నిడదవోలు**

ఆర్.ఓ.సి. నెం. 12/2024/ఇ1 తేది.16-12-2024

**ఇ-ప్రొక్యూరుమెంట్ టెండరు నోటీసు**

నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 10.00 లక్షల అంచనాల విలువ గల పైప్ లైన్ లీకులు పనిని చేయుటకు 7 రోజుల కాల పరిమితి కలిగిన షార్ట్ టెండరును మరియు రూ. 144.32 లక్షల అంచనాల విలువ గల వివిధ రకముల 19 పనులు చేయుటకు 14 రోజుల కాల పరిమితి కలిగిన టెండరును ఇ-ప్రొక్యూరుమెంట్ ప్లాట్ ఫామ్ ద్వారా ప్రకటించబడినది. వివరములకు http://tender.e-procurement.gov.in దర్శించండి.

| | |
|---|---|
| 1) బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ మొదలు | : తేది.16-12-2024 సాయంత్రం గం॥ 07.00 ల నుండి |
| 2) బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ ముగింపు | : తేది.31-12-2024 ఉదయం గం॥ 10.30ల వరకు |
| 3) టెండర్లు దాఖలు చేయుటకు ముగింపు | : తేది.31-12-2024 ఉదయం గం॥ 11.00ల వరకు |
| 4) టెండర్లు తెరచుట | : తేది.31-12-2024 ఉదయం గం॥ 11.30ల నుండి |

**పై తెలిపిన పనులలో షార్ట్ టెండరు**

| | |
|---|---|
| 1) బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ మొదలు | : తేది.16-12-2024 సాయంత్రం గం॥ 07.00 ల నుండి |
| 2) బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ ముగింపు | : తేది.23-12-2024 ఉదయం గం॥ 10.30ల వరకు |
| 3) టెండర్లు దాఖలు చేయుటకు ముగింపు | : తేది.23-12-2024 ఉదయం గం॥ 11.00ల వరకు |
| 4) టెండర్లు తెరచుట | : తేది.23-12-2024 ఉదయం గం॥ 11.30ల నుండి |

సం/- **టి.ఎల్.పి.ఎస్.ఎస్.కృష్ణవేణి**
కమిషనర్
నిడదవోలు పురపాలక సంఘము